సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం ׀ 3 ׀ జనవరి ׀ 2023



శ్రీవారికి సమర్పణ

జంగారెడ్డిగూడెం: పారిజాతగిరిలో శ్రీవారికి గొట్టుముక్కల మల్లికార్జునరావు, భాస్కర రాజు (బుట్టాయగూడెం) రూ.2.60 లక్షల విలువైన వెండి పళ్లెం, శఠగోపాన్ని సమర్పించారు.



నిత్యాన్నదానానికి విరాళం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చిన వెంకన్న నిత్యాన్నదాన పథకానికి నందేటి కృష్ణప్రసాద్ (ఏలూరు) కుటుంబ సభ్యులు రూ.3,65,000ను విరాళంగా అందజేశారు.



ఘనంగా ఊరేగింపు

పాలకొల్లు సెంట్రల్: ముక్కోటి సందర్భంగా పార్వతీ సమేత క్షీరారామలింగేశ్వరస్వామిని నంది వాహనంపై, లక్ష్మీ జనార్దనస్వామిని గరుడ వాహనంపై ఊరేగించారు.

న్యూస్‌రీల్

స్పందన అర్జీలపై సమగ్ర విచారణ



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: స్పందన కార్యక్రమంలో బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన, సమగ్రంగా విచారించి పరిష్కరించాలని జిల్లాలోని పోలీసు అధికారులను ఎస్పీ యు.రవిప్రకాష్ ఆదేశించారు. సోమవారం భీమవరం డీఎస్పీ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో ఫిర్యాదులు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. స్పందనకు 12 ఫిర్యాదులు అందగా బాధితులతో మాట్లాడి న్యాయం చేసేందుకు కృషి చేస్తామని ఎస్పీ రవిప్రకాష్ భరోసా ఇచ్చారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరంలోని బ్రౌనింగ్ జూనియర్ కళాశాల, సీఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో ఈనెల 8న జరిగే ఏపీపీఎస్సీ గ్రూప్–1 పరీక్షా కేంద్రాలను జాయింట్ కలెక్టర్ జేవీ మురళి సోమవారం తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు. భీమవరం ఆర్డీఓ దాసి రాజు, భీమవరం తహసీల్దార్ వై.రవికుమార్ ఆయన వెంట ఉన్నారు.

త్వరితగతిన రుణాలు

భీమవరం(ప్రకాశం చౌక్): ఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్ల ఏర్పాటుకు సంబంధించి లబ్ధిదారులకు రుణాలను త్వరితగతిన మంజూరు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం ఆమెఫిష్ ఆంధ్ర అవుట్‌లెట్ల ఏర్పాటుపై సమీక్షించారు. అవుట్‌లెట్ల ఏర్పాటుకు అనువైన స్థలాలను క్షేత్రస్థాయిలో గుర్తించే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. బతికున్న చేపల స్టాల్స్, పెద్ద రెస్టారెంట్ల ఏర్పాటుకు యూనిట్‌కు రూ.50 లక్షల వరకు రుణం పొందవచ్చన్నారు. 60 అవుట్‌లెట్లు గ్రౌండింగ్‌కు సిద్ధంగా ఉన్నాయని, భారీ లైవ్ ఫిష్ మోడల్ దుకాణాలను మొగల్తూరు, తణుకు, మార్టేరు, నరసాపురంలో ఒక్కొక్కటి, భీమవరం రెండు ఏర్పాటు చేయనున్నామన్నారు. అలాగే భీమవరం, నరసాపురం, పెంటపాడులో ఒక్కొక్కటి, పాలకొల్లు రెండు భారీ రెస్టారెంట్లను ఏర్పాటుచేయనున్నామన్నారు. అవుట్‌లెట్ల ఏర్పాటుకు లబ్ధిదారులు ముందుకు వచ్చేలా ప్రోత్సహించాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి దుర్మరణం

పాలకోడేరు: బైక్ ఢీకొని బాలుడు దుర్మరణం పాలైన ఘటన పెన్నాడ అగ్రహారంలో చోటుచేసుకుంది. సోమవారం ఉదయం కునుకు నాగ వినయ్(4)ను తీసుకుని తల్లి బయటకు వచ్చింది. రోడ్డు పక్కనున్న పాన్‌షాపు వద్ద బాలుడిని కూర్చోబెట్టి ఆమె రోడ్డు దాటింది. ఈ సమయంలో వేగంగా బుల్లెట్ బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి బాలుడిని ఢీకొట్టాడు. దీంతో బాలుడికి తీవ్రగాయాలు కాగా భీమవరం ఆస్పత్రికి తీసుకువెళ్లగా మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముక్తి మార్గం.. వైకుంఠ ద్వారం

- నేత్రపర్వంగా చినవెంకన్న ఉత్తర ద్వార దర్శనం
- గరుడ, శేష వాహనాలపై కరుణించిన శ్రీవారు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు, గోవింద స్వాములు

ద్వారకాతిరుమల: శ్రీనివాసా.. గోవిందా.. వేంకటరమణా.. గోవిందా.. స్మరణలు మార్మోగాయి. ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని చిన వెంకన్న దివ్య క్షేత్రం సోమవారం ఇల వైకుంఠాన్ని తలపించింది. ఉదయభానుని లేలేత కిరణాలు పుడమిపై ప్రసరించే వేళ.. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ.. ఉభయ దేవేరులతో శ్రీవారు ఉత్తర ద్వారం వద్ద వెండి గరుడ వాహనంపై దర్శనమిచ్చారు. ముందుగా సిబ్బంది ఉత్తర ద్వారాన్ని పచ్చిపూలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన గరుడ వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వేంచేపు చేసి, విశేషంగా అలంకరించారు. వేకువజాము 4.50 గంటలకు ఉత్తర ద్వారాలను తెరవగా ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావు దంపతులు, ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తదితరులు తొలి దర్శనం చేసుకుని పూజలు చేయించారు. ఉదయం 5 గంటల నుంచి భక్తులకు సర్వదర్శన భాగ్యాన్ని కల్పించారు. వేలాది మంది భక్తులు, గోవింద స్వాములు స్వామివారి దివ్యమంగళ స్వరూపాన్ని





వెండి గరుడ వాహనంపై కొలువైన శ్రీవారు, ఉత్తర ద్వారం వద్ద శ్రీవారిని దర్శించుకుంటున్న భక్తులు



పూజలు చేయిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జునరావు, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



వెండి శేష వాహనంపై భక్తులను కటాక్షిస్తున్న చినవెంకన్న



హోమ గుండంలో ఇరుముడులు సమర్పిస్తున్న గోవింద స్వాములు

వీక్షించి తరించారు. ఉదయం 7 గంటల సమయంలో స్వామి, అమ్మవార్లు ఉత్తర ద్వారం నుంచి గరుడ వాహనంపై గ్రామోత్సవానికి బయలుదేరారు. అనంతరం ఉత్తర ద్వారం వద్ద వెండి శేష వాహనంపై కొలువైన స్వామి, అమ్మవార్లు రాత్రి 9 గంటల వరకు భక్తులకు దర్శనమిచ్చారు.

ఇరుముడుల సమర్పణ

గోవింద స్వాములు ఆలయ ప్రధాన రాజగోపుర మెట్ల మార్గంలో కర్పూరంతో స్వామివారి శంఖు, చక్ర, నామాలను ఏర్పాటు చేసి వాటిని వెలిగించారు. ఇరుముడులతో స్వామిని ఉత్తర ద్వారం గుండా దర్శించి దీక్షలు విరమించారు. దర్శనం, కేశఖండన టికెట్లు, ప్రసాదాల విక్రయాలు, గదులు అద్దెకివ్వడం ద్వారా రూ.43.11 లక్షల ఆదాయం వచ్చిందని ఈఓ త్రినాథరావు తెలిపారు.

ఉత్తర ద్వార దర్శనంలో ప్రముఖులు



ఉత్తర ద్వార దర్శనం చేసుకున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ దంపతులు, సాహిత్య అకాడమీ రాష్ట్ర చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, ఏలూరు డీఆర్వో సత్యనారాయణమూర్తి, సినీ నటుడు గౌతమ్‌రాజు, కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పల హారిక, కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తా నాగేంద్రబాబు, ఉండి మాజీ ఎమ్మెల్యే వి.వెంకట శివరామరాజు తదితరులు శ్రీవారి ఉత్తర ద్వార దర్శన వేడుకలో పాల్గొన్నారు. ఆలయ ఈఓ త్రినాథరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జగన్ నాయకత్వంలో కాపులకు న్యాయం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో కాపు సామాజికవర్గానికి సంపూర్ణ న్యాయం జరుగుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో సోమవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కాపులకు రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్‌తో జోగయ్య ఆమరణ దీక్షకు దిగడం సరైంది కాదన్నారు. కాపు సంక్షేమ సేన పేరుతో ఒక సంఘాన్ని స్థాపించి జనసేనతో అంటకాగుతున్నారని విమర్శించారు. మరోవైపు వంగవీటి మోహనరంగా హత్యకు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు కారణమని జోగయ్య రాసిన పుస్తకంలోనే చెప్పారనే విషయాన్ని గుర్తించాలన్నారు. అటువంటి తెలుగుదేశంతో జతకట్టాలని ప్రయత్నిస్తున్న జనసేనకు కాపు సంక్షేమ సేన వత్తాసు పలకడం దారుణమన్నారు. జగన్ నాయకత్వంలో కాపు సామాజిక వర్గానికి సంపూర్ణ న్యాయం జరుగుతుందన్నారు. కాపులకు ఐదు శాతం రిజర్వేషన్లు అనేది ఆచరణ సాధ్యం కాదని తెలిసి కూడా తెలుగుదేశం, జనసేనలు కుయుక్తులు పన్నుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడినవారి కోసం ప్రవేశపెట్టిన ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లలో కాపు సామాజిక వర్గానికి న్యాయం జరిగేలా ముఖ్యమంత్రి జగన్ పటిష్టమైన చర్యలు తీసుకున్నారన్నారు. ప్రత్యేకంగా ఒక కమిటీని వేసి దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాలు, తొమ్మిది కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఆ కమిటీ పర్యటించి ఇచ్చిన నివేదిక ప్రకారం ఈబీసీ, ఈడబ్ల్యూఎస్‌కు అర్హతను ఎనిమిది లక్షలకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఫలితంగా పది శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లలో ఆరు నుంచి ఏడు శాతం వరకు జనాభా ప్రాతిపదికన కాపు సామాజికవర్గానికి లబ్ధి చేకూరుతుందన్నారు. లేనిపక్షంలో అది ఐదు శాతానికి పరిమితమయ్యేదన్నారు. ఈ విధంగా కాపు సామాజికవర్గానికి ముఖ్యమంత్రి విద్య, ఉద్యోగ అవకాశాల్లో ప్రయోజనం కల్పించారన్నారు. జోగయ్యతో తనకు 30 ఏళ్ల అనుబంధం ఉందని, ఆయన గురించి పూర్తిగా తెలుసునని, అంత పెద్దాయనను విమర్శించాలనుకోవడం తన ఉద్దేశం కాదని ఈ సందర్భంగా కొట్టు సత్యనారాయణ చెప్పారు. తెలుగుదేశం, జనసేనలకు రాజకీయ ప్రయోజనం చేకూరేలా వ్యవహరించాలనుకోవడం అటువంటి సీనియర్ నాయకుడికి తగదన్నారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం

కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. భీమవరం కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను గడువులోపు పరిష్కరించేలా జిల్లా, మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. స్పందనలో అందిన అర్జీలను రీఓపెన్ కాకుండా స్పష్టతతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రీ ఓపెన్ అయిన దరఖాస్తులకు సంబంధించిన జిల్లా అధికారి విధిగా పరిశీలన చేసి నివేదిక అందించాలన్నారు. సమస్యను పరిష్కరిస్తున్నప్పుడు ఫిర్యాదుదారునితో మాట్లాడుతున్న ఫొటో అప్‌లోడ్ చేయాలన్నారు. కాగా స్పందన కార్యక్రమంలో 95 దరఖాస్తులు వచ్చాయి. జాయింట్ కలెక్టర్ జేవీ మురళి, ఇన్‌చార్జి డీఆర్వో దాసి రాజు, డీపీఓ ఎం.నాగలత, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, డీఎస్పీ బి.శ్రీనాథ్ పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, జేసీ మురళి

అర్జీల్లో కొన్ని..

- అత్తిలి మండలం లక్ష్మీనారాయణపురానికి చెందిన వై.సీతామహాలక్ష్మి తనకు ఇంటి నిర్మాణం నిమిత్తం బిల్లు రాలేదని, దీంతో నిర్మాణం నిలిపివేయాల్సి వస్తోందని, బిల్లు ఇప్పించాలని కలెక్టర్‌ను కోరారు.
- వీరవాసరం మండలం కొణితివాడలో అనుమతులు లేకుండా మూడు ఎకరాల రొయ్యల చెరువు తవ్వారని, దీంతో తమ పంటలు దెబ్బతింటున్నాయని రైతు పంపన చిన నర్సింహమూర్తి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.
- నరసాపురం మండలం సరిపల్లిలో అక్రమ లేఅవుట్ల వల్ల పంట బోదెలు పూడుకుపోతున్నాయని, అక్రమ వంతెనలను నిర్మిస్తున్నారని మైలాబత్తుల వేణుగోపాలరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.
- భీమవరం షిరిడీ సాయి అపార్ట్‌మెంట్ సెక్రటరీ కె.లింగరాజు స్పందనలో కలెక్టర్‌ను కలిసి గత స్పందనలో తాను అర్జీ పెట్టుకున్న సమస్యను పరిష్కరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో ఆక్రమణలు, పారిశుద్ధ్యంపై పెద్ద ఎత్తున స్పందనలో ఫిర్యాదులు అందుతున్నాయని, దీనిపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో ఆమె సమీక్షించారు. జిల్లాలో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేదని, మెరుగైన నిర్వహణతోనే సీజనల్ వ్యాధులను సమర్థంగా ఎదుర్కోగలమన్నారు. అమృత్ సరోవర్ కింద చేపట్టిన పనులను మార్చి 31లోపు పూర్తిచేయాలన్నారు. ఆప్షన్–3 ఇళ్ల నిర్మాణాలపై దృష్టి సారించాలన్నారు. నరసాపురం లేఅవుట్‌లో లెవెలింగ్ త్వరగా పూర్తిచేసి ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలన్నారు. సచివాలయాల ద్వారా పూర్తిస్థాయిలో సేవలు అందించాలని సూచించారు.

దళితులకు భరోసా

- శ్మశాన వాటిక సమస్యలకు చెక్
- సీఎం జగన్ నిర్ణయంతో దళితవాడల్లో ఆనందం
- యుద్ధప్రాతిపదికన స్థల సేకరణకు చర్యలు
- అరెకరం నుంచి ఎకరా వరకూ స్థలం కేటాయింపు



మండవల్లి మండలం ఎస్సీ గ్రామం మణుగునూరులంకలో కొల్లేరు అభయారణ్యంలో సమాధులు

కైకలూరు: రాష్ట్రంలో దళితులకు శ్మశాన వాటిక లేని గ్రామం ఉండకూడదంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో జిల్లా అధికారులు యుద్ధప్రాతిపదికన స్థల సేకరణ చేస్తున్నారు. ప్రతి దళితవాడకు జనాభాను బట్టి అర ఎకరం నుంచి ఎకరా వరకు స్థలాన్ని గుర్తించి, పంచాయతీకి అప్పగించనున్నారు. స్వాతంత్య్రం వచ్చి ఇన్నేళ్లయినా పలు దళిత గ్రామాల్లో శ్మశాన వాటిక సమస్యలు పరిష్కారం కాలేదు. దళితుల బాగోగులు ఆలోచించే సీఎం జగన్ శ్మశాన వాటికలపై భూపరిపాలన ప్రధాన కమిషనర్, రెవెన్యూశాఖ ప్రధాన కార్యదర్శికి 45 రోజుల్లో యాక్షన్ ప్లాన్ నిర్దేశించి నివేదించాలని ఆదేశించారు. దీంతో కలెక్టర్లు శ్మశాన వాటికల అవసరం ఉన్న గ్రామాలు, అందుబాటులో ఉన్న భూముల వివరాలు క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారుల నుంచి తీసుకుంటున్నారు.

5 రెవెన్యూ డివిజన్లలో..

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 5 రెవెన్యూ డివిజన్లు, 14 నియోజకవర్గాలు, 47 మండలాలు ఉన్నాయి. ఏలూరు డివిజన్‌లో 279 ఎస్సీ గ్రామాలకుగాను 250 గ్రామాలకు శ్మశాన వాటికలు ఉన్నాయి. మిగిలిన 29 గ్రామాలకు శ్మశాన వాటిక సమస్యలు వేధిస్తున్నాయి. దీంతో చెరువు గట్లు, పుంత పోరంబోకు, కాల్వ గట్లు వంటి ప్రాంతాల్లో శ్మశాన వాటికలను ఏర్పాటు చేసుకున్నారు. ఇలాంటి చోట్ల శాశ్వత ప్రాతిపదికన స్థలాలను కేటాయించి అభివృద్ధి చేయడంతో పాటు రెవెన్యూ రికార్డులు అప్‌గ్రేడ్ చేసి, పంచాయతీలకు అప్పగించనున్నారు.

చచ్చినా ఇక్కడ పెద్ద చావే!

కైకలూరు మండలం ఆనందరావుపేట ఎస్సీ గ్రామం. దాదాపు 750 మంది జనాభా ఉంటారు. ఎవరైనా ఇక్కడ చనిపోతే అర కిలోమీటరు దూరంలో శ్మశానానికి శవపేటికలను తరలించాల్సి వస్తోంది. దారి లేకపోవడంతో పొలాల మధ్య నుంచి తీసుకెళుతుంటే పొలం యజమానులకు గ్రామస్తులకు విభేదాలు వస్తున్నాయి. మండవల్లి మండలం మణుగునూరులంక గ్రామం పూర్తిగా ఎస్సీలు నివసించే ప్రాంతం. ఈ గ్రామానికి శ్మశాన వాటిక లేకపోవడంతో కొల్లేరు అభయారణ్యంలో మృతదేహాలను సమాధి చేస్తున్నారు. వరదలు వచ్చినప్పుడు అవి మునుగుతున్నాయి. ముదినేపల్లి మండలంలో ముదినేపల్లి, నరసన్నపాలెం, వడాలి, వాడవల్లి, వణుదుర్రు, పెదపాలపర్రు వంటి గ్రామాల్లో హిందువులు, క్రైస్తవులు ఒకే శ్మశాన వాటికను ఉపయోగిస్తున్నారు. ఇటువంటి సమస్యలకు ఇకపై తెరపడనుంది.

ప్రతి వారం సమీక్ష

దళిత గ్రామాల్లో శ్మశాన వాటికలకు ప్రభుత్వ భూమి లేకపోతే రైతుల నుంచి భూమిని సేకరించి, వేరే చోట వారికి భూమి ఇవ్వాలని అధికారులను సీఎం జగన్ ఆదేశించారు. దీంతో కలెక్టర్లు స్థల సేకరణపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి వారం శ్మశాన వాటిక స్థలాలపై సమీక్ష చేస్తున్నారు. ఇప్పటికే పలు సమావేశాలను కలెక్టర్లు నిర్వహించి భూపరిపాలన కమిషనర్‌కు నివేదికలు పంపారు. దీనిపై దళితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్థల సేకరణపై దృష్టి



దళితవాడల్లో శ్మశానవాటిక లేని గ్రామాలను ముందుగా గుర్తిస్తున్నాం. దాదాపుగా ఎస్సీ గ్రామాలకు శ్మశాన వాటికలు ఉన్నాయి. కొన్నిచోట్ల చెరువు గట్లు, పోరంబోకు, కాల్వగట్లపై శ్మశానాలు ఉన్నాయి. ఇటువంటి వాటిని పరిశీలిస్తున్నాం. జనాభా ప్రాతిపదికన అరెకరం నుంచి ఎకరా వరకూ కేటాయించే అవకాశం ఉంది. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తాం.

– పెంచెల కిషోర్, ఆర్డీఓ, ఏలూరు

సీఎం నిర్ణయం భేష్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దళిత వాడలకు ఎంతో మేలు చేస్తున్నారు. శ్మశాన వాటికలు ప్రతి దళిత వాడకు ఉండాలనే ఆయన నిర్ణయం ఎంతో గొప్పది. పలు దళితవాడల్లో శ్మశాన వాటిక సమస్య చాలా సంవత్సరాలుగా వేధిస్తోంది. ప్రభుత్వమే భూసేకరణ చేసి అందించడంపై దళితులంతా ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

– డాక్టర్ జి.జాన్ విక్టర్, దళితనాయకుడు, కైకలూరు

● మురి‘పింఛెన్’

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా పింఛన్ల పంపిణీలో స్వయంగా ఎమ్మెల్యేలు, ముఖ్య ప్రజాప్రతినిధులు పాల్గొంటున్నారు.



ఆచంట మండలం కొడమంచిలిలో పింఛన్ అందిస్తున్న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు



బుట్టాయగూడెంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



ఏలూరు ఎస్ఎంఆర్ నగర్‌లో పింఛన్ అందిస్తున్న మేయర్ షేక్ నూర్జహాన్

క్లుప్తంగా

తప్పిపోయిన బాలిక తల్లిదండ్రులకు అప్పగింత



బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, పోలీసు సిబ్బంది

పెంటపాడు: సంచార జాతులకు చెందిన బాలికను ఐసీడీఎస్, పోలీసు సిబ్బంది సాయంతో సోమవారం తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్సై జి.సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గాభవాని తెలిపిన వివరాల ప్రకారం ప్రకాశం జిల్లాకు చెందిన దార్ల శ్రీను, దార్ల శాంతిలు ఏడేళ్ల కుమార్తె సత్తెమ్మతో గూడెంలో ఉంటున్నారు. గత రెండు రోజులుగా రావిపాడు ప్రాంతంలో ఒక చిన్నారి తిరగడం గుర్తించిన స్థానికులు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గాభవానికి సమాచారం అందించారు. పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు దర్యాప్తు చేసి ఆ చిన్నారి తల్లిదండ్రులు గూడెంలో ఉంటున్నారని తెలుసుకున్నారు. సత్తెమ్మను సోమవారం కుటుంబసభ్యులకు అప్పగించడంతో కథ సుఖాంతమైంది.

పేకాట శిబిరంపై దాడి

నూజివీడు: మండలంలోని అన్నవరంలో నిర్వహిస్తోన్న పేకాట శిబిరంపై జిల్లా టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో దాడులు చేశారు. టాస్క్‌ఫోర్స్ సిఐ జీకే ధనరాజ్, సెబ్ ఇన్స్‌పెక్టర్ టీ గోపాలకృష్ణ, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ సీహెచ్ అల్లూరయ్యలు సాయంత్రం 6గంటల సమయంలో పేకాట శిబిరంపై దాడి చేశారు. ఈ దాడిలో 9 మందిని అదుపులోకి తీసుకున్నారు.



మావుళ్లమ్మ అమ్మవారు

మావుళ్ళమ్మ వార్షికోత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

- 13 నుంచి నెల రోజుల పాటు జాతర
- 58 ఏళ్ళుగా ఉత్సవాలు ఘనంగా నిర్వహణ
- చివరిరోజున సుమారు లక్ష మందికి అన్నప్రసాదం వితరణ

భీమవరం(ప్రకాశం చౌక్): మావుళ్లమ్మ అమ్మవారి 59 వార్షిక మహోత్సవాలను ఈ నెల 13 తేదీ నుంచి వచ్చే నెల 10 వరకు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నీరుల్లి కూరగాయ, పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో దేవస్థాన సహకారంతో అమ్మవారి వార్షిక మహోత్సవాలు నిర్వహిస్తారు. ఇప్పటికే అమ్మవారి అలంకరణ పనులు పూర్తి చేశారు. 14 రోజుల పాటు అమ్మవారి మూల విరాట్ దర్శనం నిలుపుదల చేసి అమ్మవారిని అలంకరించారు. అమ్మవారి ఆలయం వద్ద జాతర మహోత్సవాల ఏర్పాట్లలో భాగంగా ఆలయం వద్ద చలువ పందిళ్లు, భారీ సెట్టింగ్స్ కోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

సుమారు నెల రోజులపాటు ఉత్సవాలు

మావుళ్లమ్మ అమ్మవారి వార్షిక మహోత్సవాలు నెల రోజులపాటు నిర్వహిస్తారు. ఈనెల రోజుల్లో ప్రతీ రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అమ్మవారి ఉత్సవాల చివరి 9 రోజులపాటు అలంకరణలు చేస్తారు. ప్రతీరోజు సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకూ జానపద నృత్యాలు, భరత నాట్యాలు, హరికథ, బుర్రకథ, పలు కళా ప్రదర్శనలు, భక్తి కార్యక్రమాలు, సినీ సంగీత విభావరి ఏర్పాటు చేస్తారు. నెల రోజుల పాటు సాంఘిక, పౌరాణిక నాటకాలు ప్రదర్శిస్తారు.

రూ.90 లక్షల వ్యయంతో నిర్వహణ

నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో ప్రతీ ఏడాది నిర్వహించే అమ్మవారి మహోత్సవాలకు సుమారు రూ.70 లక్షల నుంచి రూ.80 లక్షలు ఖర్చు చేస్తారు. గత రెండేళ్లు కరోనా కారణంగా అమ్మవారి ఉత్సవాలు సాధారణంగానే నిర్వహించారు. ప్రస్తుతం పరిస్థితి మెరుగుపడడంతో ఈ ఏడాది సుమారు రూ.90 లక్షలు ఖర్చు చేసి వార్షిక మహోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.



అమ్మవారి ఆలయం వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం



భారీ సెట్టింగ్స్ కోసం ఏర్పాట్లు

58 ఏళ్లుగా ఉత్సవాల నిర్వహణ

గత 58 ఏళ్లుగా నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో దేవస్థాన సహకారంతో విజయవంతంగా అమ్మవారి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో నెల రోజులపాటు నిర్వహించే ఏకైక ఉత్సవాలుగా మావుళ్లమ్మవారి ఉత్సవాలు ప్రసిద్ధి చెందాయి. ఉత్సవాల్లో సినీ నటులను ఘనంగా సువర్ణ కంఠాభరణం, హస్త కంకణంతో సత్కరిస్తారు.

భారీగా తరలి రానున్న భక్తులు

ఉత్సవాలను తిలకించడానికి రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారు. నెల రోజులపాటు ఆలయం వద్ద సందడి నెలకొంటుంది. సంక్రాంతి పండుగకు వచ్చే జనంతో పాటు భీమవరం చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భారీగా జనం తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన కళాప్రదర్శనను, ప్రత్యేక ఆకర్షణగా నిలిచే లైటింగ్, సెట్టింగ్స్, విద్యుత్ అలంకరణలను తిలకిస్తారు. అమ్మవారి ఉత్సవాలు నిర్వహించే నెలరోజుల పాటు రోజుకు సుమారు 7 నుంచి 8 వేల మంది భక్తులకు అన్నదానం చేస్తారు. ఇక అమ్మవారి ఉత్సవాల ముగింపు రోజున సుమారు లక్ష మందికి అమ్మవారి ప్రసాదాన్ని భోజన రూపంలో అందిస్తారు.

పోక్సో కోర్టు పీపీ పదవీకాలం పొడిగింపు



తేతలి శశిధర్‌రెడ్డి

ఏలూరు (టూటౌన్): ఏలూరు పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మరోసారి తేతలి శశిధర్ రెడ్డిని మూడేళ్ల పాటు కొనసాగేలా ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ సందర్భంగా శశిధర్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ప్రభుత్వం అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని తెలిపారు. శశిధర్ రెడ్డిని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్ డివి రామాంజనేయులు, ఏపిపిలు ఆచంట వెంకటేశ్వరరావు, సిహెచ్ రాజేంద్ర ప్రసాద్ తదితరులు అభినందించారు.

ఫార్మసీ కోర్సులతో ఉన్నత అవకాశాలు



వాసవీ ఫార్మసీ కళాశాలలో విద్యార్థికి ప్రశంసాపత్రం అందచేస్తున్న పాలకవర్గ కార్యదర్శి చలంచర్ల సుబ్బారావు

తాడేపల్లిగూడెం: ఫార్మసీ కోర్సులతో ఉన్నత అవకాశాలు వస్తాయని వాసవీ ఫార్మసీ కళాశాలలో కొత్త తరగతుల ప్రారంభోత్సవంలో పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావులు అన్నారు. అంతర్జాతీయంగా ఔషధ రంగంలో భారతదేశం అద్భుతమైన ప్రగతిని సాధించి ముందుకు దూసుకుపోతుందన్నారు. 2022లో ఉత్తమ విద్యార్థిగా ఎంపికైన భానుప్రసాద్‌కు బంగారు పతకం అందచేశారు.

గడపగడపకు సంక్షేమం



పెనుగొండ: ఆచంట మండలం కొడమంచిలిలో గడపగడపకు మన ప్రభుత్వంలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



కలిదిండి: మండలంలోని కొచ్చర్లలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డీఎన్నార్

రూ.5 కోట్ల మేర పోలీసు అధికారి మోసం

ఏలూరు రూరల్ : చేపల సాగు పేరుతో ఓ వ్యక్తి రూ. 5 కోట్లు దోచుకున్నాడని కొల్లేరు గ్రామం గుడివాకలంక ప్రజలు కలెక్టర్ వి.ప్రసన్న వెంకటేష్‌కు ఫిర్యాదు చేసారు. సోమవారం గుడివాకలంక గ్రామానికి చెందిన 50 మంది కలెక్టర్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. కృష్ణాజిల్లాలో పోలీసు అధికారిగా పనిచేస్తున్న కెడీవీఎం ప్రసాద్‌బాబు అలియాస్ మిల్కీయార్ ఐదుగురితో కలిసి కోమటిలంక, పెదయాగనమిల్లి గ్రామాల పరిధిలో చెరువులను లీజుకు తీసుకుని చేపల సాగు చేశారని తెలిపారు. పెట్టుబడి కోసమని తమ నుంచి రూ 5.30 కోట్లకు పైగా అప్పు తీసుకున్నాడని వినతిపత్రంలో పేర్కొన్నారు. నోట్లపై అతని భార్యచే సంతకం చేయించి ఇచ్చాడని వివరించారు. ఇదేమని ప్రశ్నిస్తే పోలీసుశాఖలో పనిచేస్తున్నందున సంతకం చేయకూడదని నమ్మించాడని చెప్పారు. అప్పు తీసుకుని నెలలు గడుస్తున్నా నేటికీ ఒక్కపైసా తీర్చలేదని వాపోయారు. పోలీసు అధికారిని, అప్పు అడిగితే పోలీసులు, రౌడీలతో కొట్టిస్తానంటూ హెచ్చరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసారు. కష్టపడి పిల్లల చదువులు, పెళ్ళిళ్లు, ఉద్యోగాలు కోసం దాచుకున్న డబ్బు అప్పు ఇచ్చి మోసపోయామని కన్నీళ్లు పెట్టుకున్నారు.

సంక్రాంతి సంబరాలు షురూ!

గిరి పల్లెల్లో మొదలైన సందడి

బుట్టాయగూడెం: సంక్రాంతి.. ఇది ఒక పండుగ మాత్రమే కాదు. ఎన్నెన్నో అనుభూతులు, మరెన్నో మేళవింపులు... భావోద్వేగాలు... ఒక మాటలో చెప్పాలంటే ఏడాదికి సరిపోయే ఎన్నో అద్భుతమైన తీపి జ్ఞాపకాల సంబరం. అలాంటి పండుగ రెండు వారాల్లో రాబోతుంది. అయితే అంతకన్నా ముందే పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు ఆట పాటలతో హోరెత్తించారు. సంక్రాంతి అనగానే వెంటనే గుర్తుకు వచ్చేవి భోగిమంటలు.. సంప్రదాయ పంచె కట్లు, పట్టు పరికిణీలు, గంగిరెడ్లు, డూడూ బసవన్నలు, సన్నాయి వాయిద్యాలు, రంగురంగుల ముగ్గులు, ఎడ్ల పందేలు, కోడి పందేలు, జానపదాలు, సరదాలు, షికార్లు ఇలా అనేక రకమైన కళలు, సాంస్కృతిక మైమరపుల కలబోతే సంక్రాంతి. సంక్రాంతి పండుగలో సాంస్కృతిక శోభను అదిమి పట్టుకునే విధంగా బుట్టాయగూడెం మండలంలోని తెల్లంవారిగూడెం పాఠశాలలో సంక్రాంతి సంబరాలను ఉపాధ్యాయులు నిర్వహించారు. హరిలో రంగ హరి అంటూ హరిదాసు సందడి, భోగిమంటలు, గొబ్బెమ్మలతో ముగ్గులు, రోలులో పిండి కొట్టే సాంప్రదాయం ఇలా అన్ని ఉట్టిపడేలా ఏర్పాటు చేసి ముందుగానే సంక్రాంతి సందడిని తీసుకువచ్చారు.





భోగి మంటల చుట్టూ విద్యార్థినులతో కలసి నృత్యాలు చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు

సంక్రాంతి వచ్చిందే తుమ్మెద

సంక్రాంతి వచ్చిందే తుమ్మెద.. సరదాలు తెచ్చిందే తుమ్మెద... అంటూ సాగే పాటకు పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజుతో పాటు ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు సైతం నృత్యాలు చేశారు. అదేవిధంగా భోగి తెచ్చే భోగం అనే పాటకు కూడా విద్యార్థులతో పాటు బాలరాజు నృత్యం చేసి అందరినీ అలరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పండగను ఆనందోల్సాహాలతో జరుపుకున్నారు. పాఠశాలలోని ఉపాధ్యాయులు సంక్రాంతి, జానపద పాటలకు నృత్యాలు విద్యార్థినులను ఉత్సాహపరిచారు.




రంగవల్లులు వేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



సంక్రాంతి సంబరాల్లో నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

మామిడిలో తేనెమంచు గుబులు



నూజివీడు: ఈ ఏడాది ఆశాజనంగా ఉన్న మామిడి పూతను తేనెమంచు పురుగులు, తామర పురుగులు ఆశించడంతో మామిడి రైతుల్లో దిగులు నెలకొంది. మామిడిపై రైతులు ఎన్నో ఆశలు పెట్టుకోగా, ప్రతికూల వాతావరణం కారణంగా సీజన్ చివరికొచ్చేసరికి ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. నూజివీడు రెవిన్యూ డివిజన్ పరిధిలో ప్రధాన వాణిజ్య పంటగా మామిడి పండిస్తున్నారు. ఆగిరిపల్లి, నూజివీడు, ముసునూరు, చాట్రాయి, చింతలపూడి, లింగపాలెం మండలాల్లో కలిపి దాదాపు 60వేల ఎకరాల్లో మామిడితోటలు విస్తరించి ఉన్నాయి. ఈ ప్రాంతం నుంచి మామిడిని ముంబయి, ఇండోర్, జహీరాబాద్, హైదరాబాద్, నున్న మార్కెట్‌లకు ఎగుమతి చేసి విక్రయిస్తారు. డిసెంబరు నెలలో పూతలు ప్రారంభమై ఫిబ్రవరి తొలి వారానికి మామిడి పిందెలు ఏర్పడతాయి. మార్చి మొదటి వారం నుంచి మామిడి కాయలు కోతకు వస్తాయి. మార్కెట్‌లో మంచి ధర లభిస్తే మామిడి రైతులకు పండుగే. ఈ ఏడాది మామిడి పూతలు ఆశాజనకంగానే ఉన్నప్పటికీ పురుగుల బెడద వల్ల నష్టం జరుగుతోందనే ఆందోళన రైతుల్లో నెలకొంది. ఇంతవరకు కొన్ని మండలాల్లో 50 శాతం తోటల్లో పూతలు కనిపిస్తుండగా, మరికొన్ని మండలాల్లో 40 శాతం తోటల్లో పూతలు కనిపిస్తున్నాయి. ఈ నెలాఖరు వరకు పూతలు వచ్చే అవకాశాలున్నందున రైతులు పూతలు రావడానికి, వచ్చిన పూతలను కాపాడుకోవడానికి రసాయన మందులు పిచికారీ చేస్తున్నారు.



నూజివీడు ప్రాంతంలో పూతకు వచ్చిన మామిడి చెట్టుకు పురుగుమందుల పిచికారీ



పూత కాడలపై తేనెమంచు పురుగులు

తేనెమంచు పురుగులు

పూత వచ్చిన మామిడి తోటల్లో తేనెమంచు పురుగులు ఆశించడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అక్కడక్కడ తామర పురుగులు కనిపిస్తున్నాయని రైతులు, ఉద్యాన వనశాఖాధికారులు పేర్కొంటున్నారు. తేనెమంచు పురుగులు గుంపులుగా చేరి లేత ఆకులు, పూత, పూతకాడలు, పిందెల నుంచి రసాన్ని పీల్చివేస్తాయి. దీంతో అవి వాడిపోయి రాలిపోతాయి. ఈ పురుగులు విసర్జించిన తేనెలాంటి తియ్యని పదార్థంపై మసి కారణమైన శిలీంద్రాలు పెరుగుతాయి. దీంతో ఆకులు, పూత, కాయలపై నల్లని మసిమంగు ఏర్పడుతుంది. దీంతో కాయల నాణ్యత దెబ్బతిని మార్కెట్‌లో ధర లభించదు. తద్వారా రైతులకు తీరని నష్టం వాటిల్లుతుంది. వాతావరణం మసకగా ఉండటంతో పాటు ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండటం ఈ పురుగుల ఉధృతికి అనుకూలం. తామర పురుగుల వల్ల కూడా మామిడికి నష్టం వాటిల్లనుంది. ఇవి పూత, పిందెలపైన ఉండి గీకడం వల్ల రాతిమంగు ఏర్పడుతుంది.

పూత మాడిపోతోంది

“ తెల్లపూత దశలో పూత మాడిపోతోంది. తేనెమంచు పురుగుల వల్లే ఇలా జరుగుతోంది. ఇప్పటికే మూడు సార్లు మందులు పిచికారీ చేశా. అక్కడక్కడ తామర పురుగులు సైతం కనిపిస్తున్నాయి. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టాం. ఇప్పటి నుంచైనా పరిస్థితి మెరుగైతే మామిడి రైతులు బయటపడొచ్చు.

– బాణావతు రాజు, లైన్‌తండా, నూజివీడు

నివారణ చర్యలు చేపట్టండి

తేనెమంచు పురుగులు, తామర పురుగుల నివారణకు పూతమీద ఉంటే లీటరు నీటికి 0.3 ఎంఎల్ ఇమిడాక్లోప్రిడ్, పూత రాకపోతే ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. 2 ఎంఎల్ ఫిప్రోనిల్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. వేపనూనె(1500పీపీఎం)ను ఒక లీటరు నీటికి 3ఎంఎల్ కలుపుకొని పిచికారీ చేసుకోవాలి. వేపనూనెను పచ్చిపూత దశలో, పిందె ఏర్పడిన తరువాత మాత్రమే కలుపుకోవాలి.

– ఆర్ హేమ, ఉద్యానవన అధికారిణి, నూజివీడు

క్లుప్తంగా

వృద్ధులకు చీరల పంపిణీ



తణుకులో వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న దాత సుజాత

తణుకు అర్బన్: చిట్టూరి సుజాత సేవా కార్యక్రమాలు అభినందనీయమని సంధ్యాజ్యోతి వృద్ధాశ్రమం కార్యదర్శి, న్యాయవాది రాధమ్మ అన్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా తణుకు సంధ్యాజ్యోతి వృద్ధాశ్రమంలో దాత చిట్టూరి సుజాత సౌజన్యంతో సోమవారం వృద్ధులకు చీరలు, పంచలు, టవల్స్, లుంగీలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఉండుర్తి ఫౌండేషన్ చైర్మన్ ప్రసన్నకుమార్, నల్ల రామకృష్ణ, నేకూరి తరుణ్, తలపాకుల అఖిల్, దున్న అమర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం, చదువుల్లో భవిత విద్యార్థులు మేటిగా ఉండాలి



నూతన సంవత్సర వేడుకల్లో భవిత విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని భవిత కేంద్రంలో నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. దివ్యాంగులచే ఏర్పాటు చేసిన నృత్యాలు అలరించాయి. ఈ సందర్భంగా దాతలు ఎస్‌కే మోహరున్నీష కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో విద్యార్థులకు భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. దాతలు మాట్లాడుతూ ఆరోగ్యంలోను, చదువులలోను నూతన సంవత్సరంలో భవిత విద్యార్థులు మేటిగా ఉండాలని ఆకాంక్షించారు. సుబ్బారావుపేట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బి.జ్యోతి, కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ



అత్తిలి కూసంపూడి పెదకాపు పార్కులో మహిళలకు చీరలను పంపిణీ చేస్తున్న దృశ్యం

అత్తిలి: సామాజిక సేవా కార్యక్రమాలలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని కూసంపూడి మూర్తి కోరారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని అత్తిలి కూసంపూడి పెదకాపు పార్కులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక మహిళలకు చీరలను ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా మూర్తి మాట్లాడుతూ ప్రతీ ఏడాది తనతండ్రి కూసంపూడి పెదకాపుపై ఏర్పాటు చేసిన పార్కులో నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తూ, సామాజిక సేవా కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలు అందించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈసందర్భంగా స్థానిక యువత కూసంపూడి మూర్తిని సత్కరించారు.

ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో జరిగిన లక్కీ డ్రాలో విజేతకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీటీసీ): ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమని డీఎం యేలూరి సత్యనారాయణ మూర్తి అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో లలిత ఆసుపత్రి వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన లక్కీ గిఫ్ట్ స్కీం డ్రా తీసి సోమవారం సాయంత్రం విజేతలను ప్రకటించారు. మొదటి మూడు బహుమతులను ప్రయాణీకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సుధారాణి, సూపర్‌వైజర్స్, ప్రయాణీకులు పాల్గొన్నారు.

5 నుంచి ఉద్యాన వర్సిటీ అంతర్ కళాశాలల పోటీలు

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పదో అంతర కళాశాలల స్పోర్ట్స్, గేమ్స్ ఈ నెల ఐదో తేదీ నుంచి ఏడో తేదీ వరకు జరుగనున్నాయని వర్సిటీ వీసీ టి.జానకీరామ్ తెలిపారు. వర్సిటీ అధికారుల పర్యవేక్షణలో ఈ పోటీలు జరుగుతాయన్నారు.

న్యూ ఇయర్ వేడుకలు

ఉద్యాన వర్సిటీలో సోమవారం జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో ఉప కులపతి టి.జానకీరామ్ మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలతో ఈ ఏడాదిలో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. కోవిడ్ ప్రతికూల పరిస్థితుల్లో సమన్వయంతో గత ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించామని , ఇకపై కూడా ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుదామన్నారు. వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

హరి నామస్మరణతో మార్మోగిన వైష్ణవాలయాలు

ముక్కోటి సందర్భంగా ఆలయాలకు పోటెత్తిన భక్తజనం

అత్తిలి: వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా అత్తిలి మండలంలోగల వైష్ణవ ఆలయాలు భక్తజనంతో కిటకిటలాడాయి. అత్తిలి రైల్వేస్టేషన్‌రోడ్డులో గల శ్రీబాలాజీ వెంకటేశ్వరస్వామివారి ఆలయానికి భక్తులు బారులు తీరారు. ఆలయ ప్రాంగణాన్ని పుష్పాలతో సుందరంగా అలంకరించారు. స్వామివారిని డ్రైఫ్రూట్స్‌తో విశేషంగా అలంకరణ చేసారు. ఉదయం నుంచి పెద్దసంఖ్యలో భక్తులు హాజరై ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వాడపల్లి సత్యనారాయణాచార్యులు, వల్లీ వెంకటేష్ ఆధ్వర్యంలో పూజాధికాలను నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రసాదాలను స్వీకరించారు. అత్తిలి వేణుగోపాలస్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరణ చేసారు. హాజరైన భక్తులకు ప్రసాద వితరణ చేసారు. అత్తిలి రైల్వేస్టేషన్ రోడ్డులో గల రామాలయంలో ఉత్తరద్వారం నుంచి భక్తులు దర్శించుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అత్తిలి రామన్నపేటలో గల విష్ణుమూర్తి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, విశేష పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అత్తిలి మండలం ఈడూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీవరాల వెంకటేశ్వరస్వామివారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినం కనుల పండువగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకించి, విశేషంగా అలంకరించారు. ఈసందర్భంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను అద్దాల మండపంలో ఉంచిన స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాధికాలను జరిపారు.



అత్తిలిలో శ్రీబాలాజీ వెంకటేశ్వరస్వామివారిని డ్రైఫ్రూట్స్‌తో విశేషంగా అలంకరించిన దృశ్యం



అత్తిలి మండలం ఈడూరు గ్రామంలో అద్దాల మండపంలో శ్రీవరాల వెంకటేశ్వరస్వామి



కొండ్రుప్రోలు శ్రీభద్రకాళి సమేత వీరేశ్వరస్వామి వారిని విశేషంగా అలంకరించిన దృశ్యం



వేల్పూరులోని వేంకటేశ్వర స్వామి ఆలయం క్యూలైన్‌లో భక్తులు



తణుకు వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు

తణుకు టౌన్: ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండలంలోని వేల్పూరు, మండపాక పైడిపర్రుల్లోని వైష్ణవాలయాలల్లో వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. సోమవారం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం, మండపాకలో శ్రీ కేశవ స్వామి ఆలయం, పైడిపర్రులో శ్రీ బాల వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా సోమవారం వేకువ జాము నుంచే స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి ఉత్తర ద్వార దర్శనం, గ్రామోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని భక్తులు అధిక సంఖ్యలో స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈకార్యక్రమాల్లో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి బోడపాటి వీర్రాజు, ఆలయ కమిటీ చైర్మన్‌లు గుణ్ణం రంగారావు, సబ్బవరపు సుజితాదేవి, చినిమిల్లి సాంబశివ రావు, ఆలయ కమిటీ సభ్యులు, ఈవో ఎంవీ రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటికి వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు...

తణుకు అర్బన్: ముక్కోటి ఏకాదశి సందర్భంగా తణుకు రాష్ట్రపతి రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఈ కార్యక్రమంలో ఆనందం బాబి, తాటిపర్తి వాసు, కొమ్మోజు రామకృష్ణ, కౌతారు రామాంజనేయులు, ఉమ్మిడి వెంకటేశ్వరరావు, బస్వా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో వైభవంగా ముక్కోటి ఏకాదశి ప్రత్యేక పూజలు

తాడేపల్లిగూడెం రూరల్: వైకుంఠ ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా సోమవారం మండలంలోని కొండ్రుప్రోలు, కుంచనపల్లి శివాలయాల్లోనూ, పెద తాడేపల్లి, మాధవరం, నందమూరు గ్రామాల్లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాల్లోనూ నిత్య పూజలతో పాటు ప్రత్యేక పూజలను నిర్వహించారు.

సీఐటీయూ మహాసభలకు భీమవరం తరలి వెళ్లిన కార్మికులు



పట్టణం నుంచి భీమవరం వెళ్తున్న కార్మికులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సీఐటీయూ రాష్ట్ర మహాసభలు భీమవరంలో సోమవారం నుంచి ప్రారంభం కాగా సభలలో పాల్గొనేందుకు తాడేపల్లిగూడెం పట్టణం నుంచి భారీగా సీఐటీయూ, అనుబంధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు తరలివెళ్లారు. తాలూకా గూడ్స్ షెడ్డు వద్ద ఉదయం జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ పతాకాన్ని యూనియన్ నాయకులు చిర్ల పుల్లారెడ్డి ఆవిష్కరించారు. రానున్న రోజుల్లో కార్మికుల హక్కుల కోసం పోరాటాలు చేద్దామని, సభలను విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా చండీ హోమం



విశేష అలంకరణలో పుంతలో ముసలమ్మ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని సీతారాంపేట-కొబ్బరితోటలో వేంచేసియున్న పుంతలో ముసలమ్మ తల్లి వార్షిక మహోత్సవాలు యువఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారి మందిరం వద్ద సోమవారం వై.సూర్యనారాయణమూర్తి, తీగవరపు సూర్యనారాయణ శాస్త్రీ బ్రహ్మత్వంలో విశేష పూజలు, అమ్మవారికి విశేష అలంకరణ, సాయంత్రం చండి సహస్ర హోమం జరిగింది. ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు రాజా త్రినాథ్ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రముఖులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

పింఛన్ పెంపుతో ఆర్థిక ఆసరా

పెంటపాడు: వృద్ధులకు, వితంవులకు నెలవారీ ఇచ్చే పింఛన్ పెంపు ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న సాహసోపేత నిర్ణయమని ముదునూరుపాడు పార్టీ ఇన్‌ఛార్జ్ మేడపాటి జనార్దన రెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆధ్వర్యంలో పలువురికి నూతనంగా పింఛన్‌లతో పాటు, ప్రభుత్వం నూతనంగా జనవరి నుంచి పెంచిన పింఛన్‌ను పలువురికి అందించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎం జగనన్నకు, స్థానిక ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సత్తి విజయభాస్కరరెడ్డి , కర్రి రమేష్‌రెడ్డి, సత్తి వేణుపాల్‌రెడ్డి, బేతిరెడ్డి రామిరెడ్డి, కర్రి శ్రీనివాసరెడ్డి, ద్వారంపూడి కిరణ్‌రెడ్డి వైఎస్సార్ సేవాసమితి, జగనన్న యూత్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.



ముదునూరుపాడులో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న దృశ్యం



తాడేపల్లిగూడెం 14వార్డులో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న బోలెం రమణ తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పురపాలక సంఘం పరిధిలో స్థానిక 14వ వార్డులో సోమవారం పెంచిన వైఎస్సార్ పింఛన్లను పలువురు లబ్ధిదారులకు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జిలు మిద్దే ఆదినారాయణ, నీరుకొండ పండు, సచివాలయ సిబ్బంది, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ సంక్షేమ కార్యక్రమాల అమలులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రికి తగ్గ తనయుడని కొనియాడారు.

స్వర్ణ కవచ అమ్మవారిగా బలుసులమ్మను తీర్చిదిద్దుతాం



బలుసులమ్మ అమ్మవారి ఆలయం వద్ద మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు, రజిత కవచ బలుసులమ్మ వారిని స్వర్ణ కవచ అమ్మవారిగా వీక్షించే విధంగా తలంపు చేపట్టినట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడించారు. పట్టణంలో సోమవారం గ్రామ దేవత బలుసులమ్మ అమ్మవారిని ముక్కోటి వైకంఠ ఏకాదశి సందర్భంగా కొట్టు సత్యనారాయణ, ఆయన సోదరుడు మురళీ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వర్ణకవచం నిమిత్తం తన వంతుగా తొలుతగా 100 గ్రాముల బంగారాన్ని కానుకగా ఇచ్చేందుకు ముందుకు వస్తున్నట్లు తెలిపారు. తన సోదరుడు సైతం మరో 100 గ్రాములు బంగారాన్ని విరాళంగా ప్రకటించినట్లు వెల్లడించారు. తమ కుటుంబ సభ్యులు, మిగిలిన సోదరులు సైతం అమ్మవారికి స్వర్ణం కానుకగా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అంతేగాక అమ్మవారి ఆశీస్సులతో ఇప్పటికే రజిత కవచం తయారు చేయించామని, రానున్న రోజుల్లో రజిత ద్వారం కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. అమ్మవారి దయతో భక్తులే స్వచ్ఛందంగా ముందుకు వస్తారని, ఎవరిని అడగవద్దని సూచించారు. అదే విధంగా ఆలయం అభివృద్ధికి కోటి రూపాయిలు ఇస్తున్నట్లు ప్రకటించారు. అన్నప్రసాద వితరణ కోసం శాశ్వతంగా డైనింగ్ హాల్ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. అమ్మవారి ఆభరణాలు భద్రపరిచేందుకు స్టోర్ రూము, ఆలయం చుట్టూ ప్రహరీ, అర్చకులకు క్వార్టర్స్ ఉంటాయని తెలిపారు. దసరా ఉత్సవాలతో తెప్పోత్సవం నిమిత్తం తటాకం ఏర్పాటు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, సెక్యూరిటీ ఆలారం ఉంటుందని వెల్లడించారు. ఇది ఇలా ఉండగా భక్తుడు 9 గ్రాములు బంగారాన్ని ప్రకటించారు. భక్తులు గమిని సత్యనారాయణ బంగారం నిమిత్తం రూ 25 వేలు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కొట్టు అంజిబాబు, పెదప్రోలు భాస్కర్, అద్దాల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

దయాలసిస్ బాధితుడికి రూ. 10వేలు పింఛన్ అందజేత



తణుకు ఆస్పత్రిలో దయాలసిస్ సెంటర్‌లో బాధితుడికి పింఛన్ సొమ్ము అందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: దయాలసిస్ బాధితుడికి నూతనంగా మంజూరైన పింఛను రూ. 10వేలును సోమవారం అందచేశారు. పట్టణానికి చెందిన తోట నాగేశ్వరరావు కొంత కాలంగా కిడ్నీ సంబంధిత జబ్బుతో బాధపడుతూ తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని దయాలసిస్ సెంటర్‌లో డయాలసిస్ చికిత్స తీసుకుంటున్నారు. అతనికి ఈనెల కొత్తగా రూ. 10వేలు పింఛను మంజూరు కావడంతో 29వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు గుడిమెట్ల వెంకట సూర్యనారాయణరెడ్డి చేతుల మీదుగా అందచేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సెక్రటరీ వి.అదృష్టరావు, వలంటీరు శిరీష పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీ ఎన్నిక



తణుకులో నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న రవిశంకర్

తణుకు అర్బన్: బ్రాహ్మణులు ఐక్యంగా ఉండి తమ సంఘాన్ని బలోపేతం చేసేందుకు కృషిచేయాలని బ్రాహ్మణ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు బలిజేపల్లి ఫణి రవిశంకర్ అన్నారు. సోమవారం తణుకు బ్రాహ్మణ సంఘ భవనంలో నిర్వహించిన సమావేశంలో తణుకు బ్రాహ్మణ సేవా సంఘాన్ని నూతనంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బలిజేపల్లి ఫణి రవిశంకర్, సలహాదారుగా సూరంపూడి కామేష్, అధ్యక్షుడిగా వడ్లూరి సాయి సీతారామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా వారణాసి శ్రీనివాస పేరయ్య శాస్త్రి, ఉపాధ్యక్షుడిగా తంగిరాల నాగవెంకట కృష్ణ సోమయాజులు, చుండూరి శేషాద్రి, తటవర్తి హరగోపాల్, విన్నకోట సత్యనాగ వెంకట చిన్నకృష్ణ, పెమ్మరాజు కిరణ్, వంగూరి కిషోర్, సహాయ కార్యదర్శులుగా తాతపూడి నూకరాజు, తుట్టగుంట వెంకటరామ భాస్కరం, ఇరగవరపు వెంకట నాగరాజు, మేడుగుల వెంకట రమణ, ఈమని సిద్దేశ్వర ప్రసాదు, కోశాధికారిగా కలవపూడి వెంకట నరసింహాచార్యులును ఎన్నుకున్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు



కోడి పందేల నివారణపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్

తణుకు టౌన్: సంక్రాంతి వేడుకల సందర్భంగా కోడి పందేలు, ఇతర అసాంఘీక కార్యకలాపాలు జరగకుండా గ్రామాల్లోని కార్యదర్శులు, రెవిన్యూ సిబ్బంది, మహిళా పోలీసులు నిఘా నిర్వహించాలని తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ చెప్పారు. సోమవారం తణుకు తహసీల్దార్ కార్యాలయంలో కోడి పందేల నివారణలో భాగంగా గ్రామ కార్యదర్శులు, వీఆర్‌వోలు, పోలీసులకు నిర్వహించిన సమీక్షా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో కోడి పందేల నిర్వహించకుండా ఎప్పటికప్పుడు సిబ్బంది అప్రమత్తంగా ఉండాల్నారు. కోడి పందేలతో పాటు గుండాట, పేకాట, అక్రమ మద్యం అమ్మకాలు వంటి వాటిని కూడా అరికట్టేందకు సిబ్బంది పర్యవేక్షించాలని కోరారు. కోడి పందాలకు సంబంధించి వివిధ గ్రామాల్లోని బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో బరులు ఏర్పాటు చేసే భూ యజమానుల వివరాలు, బరుల నిర్వాహకుల వివరాలను ఎప్పటికప్పుడు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ఎస్ నాగేశ్వరరావు, ఏఎస్సై గోవిందరావు, గ్రామా కార్యదర్శులు గుత్తికొండ వెంకటేశ్వర్లు, మొనవర్తి యుగంధర్ శ్రీనివాస్,, వీఆర్‌వోలు, గ్రామ సచివాలయ కార్యదర్శులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

వీఆర్వోల సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ



భీమవరంలో నూతన క్యాలెండర్ ఆవిష్కరించిన దృశ్యం

సాక్షి, భీమవరం: భీమవరం డివిజన్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవీంద్ర రాజు మాట్లాడుతూ కర్నూలు జిల్లా ఎమ్మిగ్నూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి వీఆర్‌ఏ, వీఆర్వోలపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు కెనడి, వైవీ మంగరాజు, భీమవరం మండలం సెక్రటరీ జి జక్కరయ్య, గౌరీ శంకర్, రాజమణి, ముత్యాలరావు, కోటేశ్వరరావు, సురేష్, బాబులు, రామాంజనేయులు పాల్గొన్నారు.

కనులపండువగా మదనగోపాలుని ఉత్తరద్వార దర్శనం



బల్లిపాడులో ఉత్తరద్వారం నుంచి భక్తులకు దర్శనమిస్తున్న మదనగోపాలస్వామి



అత్తిలి మండలం బల్లిపాడులో గరుడవాహనంపై స్వామివారి గ్రామోత్సవ దృశ్యం

అత్తిలి: జిల్లాలో వైష్ణవక్షేత్రాలలో ప్రసిద్ధిగాంచిన బల్లిపాడు మదన గోపాలస్వామివారి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పర్వదిన వేడుకలు కనుల పండువగా జరిగాయి. సోమవారం వేకువజామునే మదనగోపాలస్వామివారికి పంచామృతాలు, పండ్లరసాలు, సుగంధ పరిమళ పూజా ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను మేళతాళాలతో ఉత్తరద్వారం వైపు తీసుకువచ్చి గరుడవాహనంపై ఉంచారు. ఉత్తర ద్వారం నుంచి భక్తులు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రతీ ఏడాది ముక్కోటి ఏకాదశి పర్వదినాన స్వామివారు ఉత్తరద్వారం నుంచి భక్తులకు దర్శనమిస్తారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ఉత్తరద్వారంనుంచి స్వామి వారిని దర్శించి తరించారు. గరుడవాహంపై వేంచేసియున్న మదనగోపాలస్వామిని కేరళా డప్పు వాయిద్యాలు నడుమ గ్రామోత్సవాన్ని జరిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ ధనుమూరి తాతాజీ, ఈవో చందకం దారబాబు, పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

స్పందనకు మూడు అర్జీలు

తాడేపల్లిగూడెం రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూకు రెండు, హౌసింగ్‌కు ఒకటి అర్జీలు అందాయని ఎంపీడీవో ఎం.వెంకటేష్ తెలిపారు. స్పందనలో వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేష్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మండపాకలో వైఎస్సార్ బీమా చెక్కుల పంపిణీ



మండపాకలో మృతుల కుటుంబాలకు వైఎస్సార్ బీమా చెక్కులను అందజేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలకు వైఎస్సార్‌సీ బీమా పథకంలో మంజూరైన చెక్కులను ఆయా కుటుంబాలకు అందజేశారు. సోమవారం మండపాక గ్రామంలో ఇటీవల మృతి చెందిన బీమవరపు జగన్నాయకులు, గడుసుల చెల్లయ్య కుటుంబాలను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోడపాటి వీర్రాజు ఆధ్వర్యంలో నాయకులు పరామర్శించి వైఎస్సార్ బీమా పథకంలో మంజూరైన చెక్కును ఆయా కుటుంబాలకు అందజేసినట్లు తెలిపారు.